
# Laya's wedding



ఉత్తరాది వరదలో అచ్చమైన తెలుగుదనం

ఉత్తరాది నుంచి దిగుమతవుతున్న హీరోయిన్లు దక్షిణాది సీమను ఏలుతున్న ఈ కాలంలో తెలుగుదనానికి ప్రతీకలా, అశ్లీలతకు తావులేని రీతిలో పాత్రలను ఎంపిక చేసుకున్న నటీ- లయే!

లయ గురించి ఎవరు చెప్పినా ఒకటే మాట! అది ఉత్తరాది వరదలో అచ్చమైన తెలుగుదనం అని. ఇప్పటి వరకూ హీరోయిన్‌గా ఉన్న లయ వివాహ వేడుక నేడు.



అందం, అభినయం, ఉన్నతవిద్య అర్హతలుగా ఉండీ, తెలుగు తెరపై హీరోయిన్‌గా మనగలగడమన్నది సాధారణ విషయమేమీ కాదు. కానీ అటువంటి అరుదైన అంశాలన్నీ కలిగిన నటిగా గుర్తింపు పొందిన నటి - లయ! సుమారు ఆరేళ్ళ నటనా జీవితంలో ఆమె నటించింది కేవలం 39 సినిమాలే, అందులో రెండుసార్లు నంది అవార్డు పొందడమంటే మాటలు కాదు! 'ప్రేమించు', 'మనోహరం' చిత్రాలకు ఆమె నంది అవార్డులు పొందారు. వరుసగా 2001, 2002 సంవత్సరాలకుగాను నంది అవార్డులు పొందడం నటనా జీవితంలో అత్యంత ఆనందాన్ని పొందిన ఘడియలని ఆమె చెబుతారు.

“ఎంసిఏ చదివిన తనకు విదేశంలో ఉద్యోగం చేయడమే భావి ప్రణాళిక” అని ఆమె చెప్పారు. అంటే వివాహమైన తర్వాత మరి సినిమా రంగానికి స్వస్తి చెప్పడమేనా అంటే ఆమె ఏం చెబుతున్నారో చూద్దాం!

“నిజమే! వివాహమైన తర్వాత సినీ జీవితాన్ని వదులుకోవడాన్నే ఇష్టపడుతున్నాను. అమెరికా వెళ్ళి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడాలనుకుంటున్నాను.వరుడు గణేష్ అమెరికాలో రేడియేషన్ అంకాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు. ఇది పెద్దలు కుదిర్చిన వివాహమే” అని ఆమె చెప్పారు.



సాధారణంగా హీరోయిన్లన్నవారు మిగిలిన వారిలా కాక కొద్దిగా వయసు పెరిగిన తర్వాత వివాహం చేసుకుంటుంటారు. కానీ లయ మాత్రం ఈ పోకడను పక్కనపెట్టి హీరోయిన్‌గా కొనసాగుతున్నప్పుడే వివాహ యోచన చేశారు. 1999వ సంవత్సరంలో స్వయంవరం చిత్రం ద్వారా లయ పరిచయమయ్యారు. విజయవాడకు చెందిన ఈ యువతి తక్కువకాలంలోనే సినీ పరిశ్రమలో గుర్తింపు పొందారు. చెస్‌లో కూడా నిపుణురాలైన లయ బాలకృష్ణవంటి నటులతో కూడా సినిమాలు చేశారు.

“సినీ జీవితానికి సమానంగా నిజ జీవితానికీ ప్రాధాన్యం ఇవ్వడమే సబబు. అదే ఆలోచనతో వివాహం చేసుకోవడానికి ఇదే సరైన సమయమని నిర్ణయించుకున్నాను” అని చెబుతున్న లయ వైవాహిక, భావి జీవితం శుభప్రదం కావాలని ఆకాంక్షిద్దాం!